పది పరీక్షలు ప్రారంభం

జిల్లా వ్యాప్తంగా సజావుగా నిర్వహణ

ఆత్మకూరు(ఎం)లో పరీక్ష కేంద్రం వద్ద హాల్ టికెట్‌లు పరిశీలిస్తున్న సిబ్బంది

భూదాన్ పోచంపల్లి : జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన ఆర్డీఓ శేఖర్‌రెడ్డి

చౌటుప్పల్‌లో హాల్ టికెట్లను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయురాలు

చౌటుప్పల్, మార్చి 18 : పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు తెలుగు పరీక్ష జిల్లా వ్యాప్తంగా సజావుగా సాగింది. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ విధించారు. చౌటుప్పల్ మండలంలో 1,260 మంది విద్యార్థులకు గాను నలుగురు గైర్హాజరయ్యారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో మొత్తం 187 మంది విద్యార్థులకు గాను అందరూ హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ రఘురాంరెడ్డి, డిపార్టుమెంట్ ఆఫీసర్ మహదేవరెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని ఎంపీడీఓ నిరంజన్‌వలీ పరిశీలించారు.

తుర్కపల్లి : మండలంలో ఏర్పాటు చేసిన రెండు కేంద్రాల్లో మొత్తం 370మందికిగాను అందరూ పరీక్షకు హాజరయ్యారు. వివిధ పాఠశాలల విద్యార్థులకు బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గట్టు తేజస్వీనిఖిల్ పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు.

మోటకొండూర్ : మండలంలో మొత్తం 227 మంది విద్యార్థులకు గాను అందరూ హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ లక్ష్మి తెలిపారు.

వలిగొండ : మండల కేంద్రంలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 530 మంది విద్యార్థులకుగాను ఇద్దరు గైర్హాజరయ్యారు.

భూదాన్ పోచంపల్లి : పట్టణంలో ఏర్పాటు చేసిన మూడు పరీక్ష కేంద్రాల్లో 542 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాలను చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి సందర్శించారు. ఆయన వెంట తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, చీఫ్ సూపరింటెండెంట్లు రాజారెడ్డి, రమాదేవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

యాదగిరిగుట్టలో నిత్యోత్సవాలు

యాదగిరిగుట్ట, మార్చి 18 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారికి నిత్యోత్సవాలు అత్యంత వైభవంగా సాగాయి. సోమవారం తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, అరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహుడు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణపుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం దర్బార్‌సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రి స్వామివారికి తిరువారాధన, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. రాత్రి ప్రధానాలయ ముఖ మండపంలో ప్రతిష్ఠామూర్తులకు తిరువారాధన, సహస్రనామార్చన జరిగాయి. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. అనుబంధ రామలింగేశ్వరస్వామి ప్రధానాలయంలో పరమశివుడు, స్పటికలింగేశ్వరుడికి రుద్రాభిషేకం అత్యంత వైభవంగా సాగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. స్వామివారిని 17వేల మంది భక్తులు దర్శించుకున్నారని, అన్ని విభాగాలను కలుపుకొని స్వామి వారి ఖజానాకు రూ.29,54,302 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి



ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న తడక రమేశ్, నాయకులు

భూదాన్ పోచంపల్లి, మార్చి 18 : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మున్సిపాలిటీకి చెందిన పద్మశాలీ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తడక రమేశ్, కౌన్సిలర్ గారిదారెడ్డి మంజుల, మాజీ ఎంపీటీసీ కొట్టం కరుణాకర్‌రెడ్డితోపాటు 100 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశం, మల్లేశ్ యాదవ్, లవకుమార్, నర్సింహారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. పార్టీ గెలుపునకు కృషి చేయాలి

● మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామన్నపేట, మార్చి 18 : ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, అధైర్య పడకుండా పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పని చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 3నెలలు అయినా రైతుబంధు, రుణమాఫీ, పింఛన్ పెంపు అమలు చేయలేదన్నారు. మూడెకరాలకు రైతుబంధు ఇచ్చేందుకు 3నెలలు పట్టిందని విమర్శించారు. రాష్ట్రంలో నీళ్లు అందక పంటలు ఎండిపోతున్నా మంత్రులు, అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన పనులను ఎత్తిచూపుతూ బదనాం చేయడమే తప్ప అధికారంలోకి వచ్చి ప్రజలకు చేసిందేమీ లేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు ప్రజల వద్దకు వెళ్లి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించి ఓట్లు అడుగాలని సూచించారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోశబోయిన మల్లేశం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీపీ కన్నెబోయిన జ్యోతీబలరాం, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, ఎంపీటీసీలు గొరిగె నర్సింహ, దోమల సతీశ్, వేమవరపు సుధీర్‌బాబు, గాదె పారిజాత, నాయకులు దయాకర్, రాములు, మాధవ రెడ్డి, లక్ష్మీనర్సు, స్వామి, యాదయ్య, వెంకటేశం, అశోక్, సంతోష్, నరేందర్, విక్రం, మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీకృష్ణ గొర్రెల పెంపకందారుల సంఘం ఎన్నిక

నూతనంగా ఎన్నికైన శ్రీకృష్ణ గొర్రెల పెంపకదారుల సంఘం సభ్యులు

రామన్నపేట, మార్చి 18 : మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామంలో శ్రీకృష్ణ గొర్రెల పెంపకందారుల సంఘం నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తిరుపాల మల్లయ్య, కార్యదర్శిగా బెల్లి లింగస్వామి, ఉపాధ్యక్షుడిగా రేపాక లింగస్వామి, డైరెక్టర్లుగా సాగర్ల శేఖర్, బుర్ర శ్రీశైలం, మచ్చ మహేశ్, జాల చంద్రయ్య, దగ్గల మారెమ్మ, జెల్లెల లలిత ఎన్నికయ్యారు. సంఘం అభివృద్ధితోపాటు గొర్రెల పెంపకందారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తిరుపాల మల్లయ్య అన్నారు.

కుష్ఠు వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలి

● లెప్రసీ రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ సుధ

జలాల్‌పూర్‌లో ఇంటింటి సర్వేలో పాల్గొన్న డాక్టర్ సుధ

భూదాన్ పోచంపల్లి, మార్చి 18 : కుష్ఠు వ్యాధి నివారణకు జాగ్రత్త చర్యలు పాటించాలని లెప్రసీ తెలంగాణ రాష్ట్ర పరిశీలకురాలు డాక్టర్ సుధ సూచించారు. మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు సోమవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ, ఆరోగ్య కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి సభ్యుల చర్మంపై మచ్చలు ఉన్నాయా? అని పరిశీలించాలన్నారు. వ్యాధి లక్షణాలు ఏమైనా ఉంటే నిర్ధారణకు మండల వైద్యాధికారి పరిశీలిస్తారని తెలిపారు. వైద్య సిబ్బంది ఆశ, ఆరోగ్య కార్యకర్తలు ఇంటికి వచ్చినప్పుడు సహకరించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ పాపారావు, డీపీఎంఓ బసవరాజు, సంతోష్, మండల వైద్యాధికారి శ్రీవాణి, సీహెచ్ఓ పోతారెడ్డి, లెప్రసీ నోడల్ పర్సన్ ఎంఏ బేగ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుడి కల్యాణం

● పాల్గొన్న ప్రభుత్వ విప్ అయిలయ్య, మాజీ ఎమ్మెల్యే సునీత

వేంకటేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొన్న మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

రాజాపేట, మార్చి 18 : మండలంలోని రేణికుంట గ్రామ శివారులోని సంకల్ప సిద్ధి వేంకటేశ్వరాలయంలో పీఠాధిపతులు శ్రీమాన్ బిక్కవోలు కేశవాచార్య దైవజ్ఞశర్మ ఆధ్వర్యంలో సోమవారం స్వామివారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. గోవింద నామస్మరణలతో ఆలయం మార్మోగింది. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి వేర్వేరుగా పాల్గొని పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ నిర్మాణ ధర్మకర్తలు అన్నదానం చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

కనుముక్కులలో లక్ష పుష్పార్చన

వేంకటేశ్వరస్వామి దేవాలయంలో లక్ష పుష్పార్చనలో పాల్గొన్న భక్తులు

భూదాన్ పోచంపల్లి, మార్చి 18 : మండలంలోని కనుముక్కుల గ్రామంలో పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయంలో లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఆలయంలో హనుమంతుడి సేవ, హోమం, బలిహరణం, తీర్థ ప్రసాద గోష్ఠి, విశేష ఆరగింపు, తీర్థ ప్రసాద వితరణ పూజా కార్యక్రమాలు జరిగాయి. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ కోట మల్లారెడ్డి, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

బాలాజీ రామకృష్ణ దేవాలయంలో..

ఆలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

చౌటుప్పల్, మార్చి 18 : పట్టణంలోని బాలాజీ రామకృష్ణ దేవాలయంలో పద్మావతి, అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు సోమవారం రెండో రోజు ఘనంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతం, గణపతి పూజ, స్వామివారికి విశేష పంచామృత అభిషేకం, సహస్రనామ పుష్పార్చన, ధ్వజారోహణ హోమం, తీర్థప్రసాద వితరణ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు సుర్కంటి మహేందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, ఆలయ ప్రధాన కార్యదర్శి పాశం సంజయ్ బాబు, భక్తులు పాల్గొన్నారు.

పశువుల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వీరారెడ్డిపల్లిలో పశువులకు టీకా వేస్తున్న పశు వైద్యాధికారి జనార్దన్

తుర్కపల్లి, మార్చి 18 : పశువులకు సీజనల్‌గా సోకే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారి ఎల్.జనార్దన్ సూచించారు. మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామంలో సోమవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అందించే సబ్సిడీ మందులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శేఖర్, మహేశ్, రైతులు పాల్గొన్నారు.

ఎరుకల నాంచారమ్మ ఉత్సవ కమిటీ రాష్ట్ర చైర్మన్‌గా సురేశ్

కుతాడి సురేశ్

భూదాన్ పోచంపల్లి, మార్చి 18 : ఎరుకల నాంచారమ్మ ఉత్సవ కమిటీ రాష్ట్ర చైర్మన్‌గా కుతాడి సురేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని పిల్లాయిపల్లి గ్రామంలో ఎరుకల నాంచారమ్మ సంఘం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశంలో ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్లుగా కోనేటి నరసింహ, మాదలాపురం గోపాల్, దేవరాయ కుమార్, కుతాడి యాదగిరి, రాయపురం వెంకటేశ్వర్లు, అంగడి లక్ష్మీనారాయణ, భిక్షపతి, రుద్రాక్ష వెంకన్న, నల్లగొండ వీరన్న, ప్రధాన కార్యదర్శిగా కుతాటి మహేశ్, కోశాధికారిగా కుతాటి యాదగిరి, కార్యదర్శులుగా కుతాడి నందం, కుతాడి బాలరాజు, కుతాడి అంజన్‌కుమార్, దేవరాయ సుధాకర్, మానుపాటి సంపత్, డైరెక్టర్లుగా కుతాడి అంజయ్య, కుతాడి ముత్యాలు, కేసరం నాగరాజు, పుడుత సాలయ్య, బిజిలి సంపత్, అంగడి దినేశ్ ఎన్నికయ్యారు.

నిషేధిత పేలుడు పదార్థాలు స్వాధీనం

● ఇద్దరికి రిమాండ్

ఎస్ఓటీ పోలీసులు స్వాధీనం చేసుకున్న జిలిటెన్‌స్టిక్స్

వలిగొండ, మార్చి 18 : నిషేధిత పేలుడు పదార్థాలను ఎస్ఓటీ పోలీసులు స్వాధీనం చేసుకొని ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అరూరు గ్రామ పరిధిలో గల నంగునూరి రమేశ్ వ్యవసాయ క్షేత్రంలో అక్రమ పేలుళ్లకు పాల్పడుతున్నారనే సమాచారంతో ఎస్ఓటీ పోలీసులు సోమవారం దాడి చేశారు. పేలుళ్లకు ఉపయోగించే 53 జిలెటిన్‌స్టిక్స్, కనెక్షన్ వైర్, మెగ్గర్ బాక్స్, కనెక్టింగ్ వైర్లను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. అక్రమ పేలుళ్లకు పాల్పడుతున్న కొమ్మగాని శ్రీధర్, నంగునూరి రమేశ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

భువనగిరి కలెక్టరేట్, మార్చి 18 : పట్టణంలోని హుస్సేనాబాద్ సమీపంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు, పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 35 ఏండ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం హుస్సేనాబాద్ సమీపంలో కనిపించగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని పరిశీలించారు. హత్యా, ఆత్మహత్యనా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి సంఘటనా స్థలంలో వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ సురేశ్‌కుమార్ తెలిపారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి

● ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి

మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, మార్చి 18 : వేసవిలో నీటి సమస్యలు తలెత్తకుండా గ్రామాల్లో తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మోటార్లు కాలిపోతే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. పైపులైన్ లీకేజీలను గుర్తించాలని, నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా షేడ్‌నెట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ రాపర్తి భాస్కర్‌గౌడ్, వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, సూపరింటెండెంట్ చంద్రమౌళి, ఎంపీటీసీలు, అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పోచంపల్లిలో కారు బీభత్సం

నల్ల పోచమ్మ దేవాలయంలోకి దూసుకొచ్చిన కారు

భూదాన్ పోచంపల్లి, మార్చి 18 : మద్యం మత్తులో ఓ యువకుడు అతివేగంగా, అజాగ్రత్తగా కారు నడిపి బీభత్సం సృష్టించాడు. పట్టణ కేంద్రానికి చెందిన సీత సంజయ్ ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో కారులో పార్టీకి వెళ్లి పోచంపల్లికి తిరిగి వస్తూ అతివేగంగా, అజాగ్రత్తగా డ్రైవ్ చేశాడు. మూలమలుపును తప్పించబోయి అదుపుతప్పి బొడ్రాయిని ఢీకొట్టాడు. అనంతరం నల్ల పోచమ్మ దేవి ఆలయం ఆవరణలోకి దూసుకెళ్లి పిల్లర్‌ను ఢీకొట్టగా కారు బెలూన్లు విప్పుకోవడంతో సంజయ్‌కి పెను ప్రమాదం తప్పింది. అర్ధరాత్రి పెద్ద శబ్దం రావడంతో స్థానికులు భయాందోళనతో దేవాలయం వద్దకు వచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అర్ధరాత్రి కారు బీభత్సం సృష్టించినా ఫిర్యాదులు అందలేదని పోలీసులు తెలిపారు. దేవాలయానికి సంబంధించిన నాయకులు, గ్రామ పెద్దలతో మాట్లాడుకోవాలని పోలీసులు సూచించడం గమనార్హం.

అపరిచితులు కనిపిస్తే సమాచారం ఇవ్వండి

మోత్కూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మోత్కూరు, మార్చి 18 : గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ నర్సయ్య రాత్రి సమయాల్లో దొంగతనాలు జరుగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం ప్రయాణికులకు అవగాహన కల్పించారు. కొత్త వ్యక్తులు పిల్లలకు చాక్లెట్లు ఇస్తే తీసుకోవద్దన్నారు. వేసవిలో పెండ్లిళ్లు, పండుగలు, శుభకార్యాలకు వెళ్లేవారు ఇంటికి తాళం వేసి ఇరుగుపొరుగు వారికి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ కంట్రోలర్ రజిత, కానిస్టేబుల్ ముత్తయ్య పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు సహకరించాలి

● మోత్కూరు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

మోత్కూరు, మార్చి 18 : మున్సిపాలిటీలో కొనసాగుతున్న రోడ్డు వెడల్పు పనులకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ కోరారు. పట్టణంలోని రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ స్తంభాలు నాటే పనులను సోమవారం ఆయన పరిశీలించారు. మున్సిపల్ పాలకవర్గం తీర్మానం మేరకు డివైడర్ నుంచి ఇరువైపులా 40 ఫీట్ల మేర ఇళ్లను తొలగించుకోవాలన్నారు. డివైడర్ నుంచి 33 ఫీట్ల వరకు విద్యుత్ కొత్త స్తంభాలు నాటే కార్యక్రమం కొనసాగుతున్నదని తెలిపారు. అలసత్వం ప్రదర్శించి ఇళ్లను తొలగించని వారిపై మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట మున్సిపల్ ఇంజినీర్ శ్రవణ్‌కుమార్, సిబ్బంది ఎడ్ల శ్రీకాంత్, జంగ నాగరాజు, హన్మకొండ నర్సింహాచారి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఆత్మకూరు(ఎం), మార్చి 18 : మండల కేంద్రానికి చెందిన చిత్తర్ల రామక్క అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. మృతురాలి కుటుంబాన్ని మాజీ సర్పంచులు జన్నాయికోడె నగేశ్, యాస లక్ష్మారెడ్డి పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. వారి వెంట పీఏసీఎస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, నాయకులు మల్లేశం, వెంకట్‌రెడ్డి, నర్సయ్య, శ్రీను, అనిల్ ఉన్నారు.